# పెళ్ళానికి ప్రేమలేఖ

పార్వతి బెడ్‌రూం వదిలి, హాలు ముఖం చూసి పదిరోజులైంది. ఎవరెవరో చుట్టాలో తన కోడళ్లో వచ్చి కాఫీయో మంచి నీళ్లో మజ్జిగో బలవంతంగా తాగిస్తే బతుకుతోందేమో. చిన్న ఇడ్లీ ముక్క నోటికందించినా... నేను మింగలేనర్రా... వద్దర్రా - దుఃఖాన్ని

దిగమింగుకున్నాక ఏదైనా తింటాను అంటోంది.

ప్రేమగా కోపంగా మందలించేవాళ్లు ఏడుస్తూ 'ఏం తినకపోతే ఎలా' అని దుఃఖపూరితంగా అడిగితే "ఏమీ అయిపోను- దేవుడు నా గుండె గట్టిగా చేశాడు. లేకపోతే ఆయన పోగానే నా ప్రాణం పోయేది. ఇప్పుడు నేను ఏమీ తినకపోయినా చనిపోను" అంది. ఇంటినిండా ఉన్న బంధువులకి పార్వతి దుఃఖాన్ని తీర్చడం ఎలాగో తెలియట్లేదు. వాళ్లే వండుకుంటున్నారు. కొడుకులిద్దరూ ఉదయమో సాయంత్రమో వచ్చి ఏం తిన్నావంటూ 'ఏదైనా తినమంటూ...' నచ్చచెప్పి వెళ్తున్నారు.

పార్వతికి ఆవేళ చీకటి రోజులు పది పూర్తయ్యి శాశ్వతంగా చీకట్లోకి నెట్టేసే రోజొచ్చింది. సాంప్రదాయం ఆవిడ బొట్టు చెరిపేస్తుంది. మంగళసూత్రాలు తెంచేస్తుంది. నగలూ గట్రా వొలిచేస్తుంది. రంగుల జీవితాన్ని స్నానంతో వెలిసిపోయేలా చేస్తుంది.

వాళ్లకి కావల్సింది సంప్రదాయ సంరక్షణ.

పార్వతి బాత్‌రూంలోకెళ్లి షవర్ విప్పి స్నానం చేసింది. కన్నీళ్లతో ఒళ్లంతా తడుపుకుంటూ మట్టెలూ మంగళసూత్రాలూ సర్వాభరణాలూ తీసేసింది. ఆయన కట్టిన తాళి... ఆయన పెట్టిన మట్టెల్నీ.. అన్నీ తీస్తుంటే ఆయన జ్ఞాపకాల్ని పూర్తిగా తొలగిస్తున్నట్లు విలవిలలాడింది.

ఆ స్వర్ణాభరణాలు తీసేసినంత మాత్రాన అణువణువునా నిండి ఉన్న ఆయన స్మృతులు పోతాయా? ఎప్పుడైనా మంగళసూత్రాలు పెరిగిపోయినప్పుడో, మట్టెలు అరిగిపోయినప్పుడో కొత్తవి చేయించి ఆయన చేత మళ్ళీ మళ్లీ తాళి కట్టించుకునేది. మళ్లీ మళ్లీ మెట్టెలు పెట్టించుకునేది పార్వతి.

ఇప్పుడు వాళ్లెవళ్లో బంధువులొచ్చి వీటినన్నిటినీ తీసేస్తే తట్టుకునే

శక్తి ఇక అస్సల్లేదు. అందుకే తనే స్వయంగా సంప్రదాయానికి సహకరించింది. సర్వ స్వర్ణాభరణాలు వదిలేసి వెలిసిపోయిన కోక కట్టుకుని మంచం మీద బోర్లపడి భోరుమని ఏడ్చింది.

ఆ మంచం మీద ఆ దిండ్లూ పరుపులూ మార్చి మళ్ళీ కుట్టించుకున్నప్పుడల్లా తన భర్తకి శోభనమంత సంబరం. దిండుగలేబు మార్చినా 'మనసు మత్తెక్కిపోతోందే' అనేవారు. ఇప్పుడు ఆ దిండ్లు పది రోజులుగా కన్నీళ్లతో తడిసిపోతున్నాయి. ఇన్నాళ్లుగా ఎప్పుడూ ఈ దిండ్లు ఇలా తడిసిపోతాయని పార్వతి అనుకోలేదు.

దబ దబా తలుపు చప్పుడు.

ఎంతసేపట్నుంచీ బాదుతున్నారో తెలియదు గానీ శబ్దం కంగారులో పడ్డాక గట్టిగా మోగుతున్నట్టు అనిపించి ఉలిక్కిపడి లేచింది.

పార్వతి వెళ్లి తలుపు తీసేటప్పటికి 'హమ్మయ్యా.. బతికే ఉంది' అని కొందరనుకుంటే 'అయ్యయ్యో.. తనే తీసేసింది' అని ఇంకొందరు అనుకున్నారు.

పార్వతి లోపలికి వచ్చి తాను తీసేసిన ఆభరణాలన్నీ కోడలి దోసిట్లో పోసింది.

"ఇవిగోమ్మా... నా ఐశ్వర్యం... ఐదోతనం.. కుంకుమ భరిణ కూడా దీంట్లోనే పెట్టాను.. మనవాళ్లతో చెప్పు... వాళ్లు వేయిద్దామనుకున్న వైధవ్య వేషం కూడా నేనే వేసేసుకున్నాను" అంటూ మంచంమీద కూలబడి వెక్కెక్కి ఏడ్చింది.

లోపలికొచ్చిన ఆడాళ్లందరూ నిశ్చేష్టులై ఆవిడని ఓదార్చలేకపోయారు.

ఇవాళ శుద్ధి. పరుపు దిండ్లూ తడపాలి. నువ్వొక్కసారి అలా కుర్చీలో

కూర్చుంటే...

మాట పూర్తవ్వకుండానే పార్వతి లేచి నిలబడింది. పరుపు తీస్కెళ్లమన్నట్లు సైగ చేసింది.

పరుపు ఎత్తగానే దానికింద ఎన్నో కాగితాలు ఒక డైరీ కనపడింది. పార్వతికి వాటన్నింటినీ సర్దిపెడదామన్న కోడలితో 'వాటినలాగే ఉంచమ్మా. నేను చూసుకుంటాలే మీరు వెళ్లండి' అంది.

బంధువులంతా దిళ్లూ పరుపులు ఎత్తుకొని బయటికెళ్లారు. తలుపు మూసుకుంది పార్వతి.

ఆ కాగితాల్లో ఎలక్ట్రికల్ బిల్స్, వాటర్ బిల్స్, ఇంటి పన్ను కాగితాలు... ఏవేవో కనిపించాయి. అన్నీ ఒత్తుగా పెట్టింది.

ఆ డైరీ ఏంటీ? తనెప్పుడూ చూళ్లేదు.

ఆసక్తిగా తెరిచింది పార్వతి.

ఆ డైరీ ఒక సంవత్సరంది కాదని తమ జీవితాలదని అర్థమైంది.

1957 పంచమి. సోమవారం. అక్టోబర్ 28వ తేదీ నా పెళ్లి చూపులు. అమ్మాయి పేరు పార్వతి.

లక్ష్మీదేవి కళ. సరస్వతీదేవి ఆ అమ్మాయి నాలుకమీదే ఉంది. ఎంత అందంగా పాడుతుందో.

కట్నం వద్దని నేనన్నాను. ఆ అమ్మాయే కావాలనుకున్నాను. ఏమవుతుందో మా ఇంట్లోవాళ్లు ఒప్పుకుంటే చాలనిపిస్తుంది.

పార్వతి కన్నీళ్లు ఆనందబాష్పాలయ్యాయి. మరో పేజీ తిప్పింది. 1957 నవంబర్ 3 ఇవ్వాళ నిశ్చయ తాంబూలాలకి పార్వతి ఇంటికెళ్లాం.

మళ్లీ పెళ్లి పేజీ.. మొదలెట్టి చదవాలనిపించింది. కానీ పార్వతి ఆ దుఃఖాన్ని తట్టుకోలేకపోయింది. ఎంత పులకింతతో తను మూడుముళ్లు వేశారో ఎంత ఆనందంగా ఫీలయ్యారో దాంట్లో రాసి ఉంది.

మంగళసూత్రాలు కడుతున్నప్పుడు మట్టెలు పెడుతున్నప్పుడు తను పొందిన అనుభూతి హృదయానువాదంగా రాసుకున్నారు. ఆ గతం పార్వతి ఇప్పుడు తట్టుకోలేదు పేజీ తిప్పేసింది.

'మరపురాని రేయి. మరువలేని హాయి' అంటూ రెండు పేజీల ఆనందం. పార్వతికి చదవాలని లేదు. ఆ పేజిలో ఆనాటి మల్లెపూలు ఎండిపోయి రోదిస్తున్నాయి. దుఃఖం కట్టలు తెగుతోంది. డైరీని కౌగిలించుకుని ఎంతసేపు ఏడ్చిందో... తనని తనే ఓదార్చుకుని కాదు డైరీయే ఓదార్చిందేమో... తేరుకుంది.

మళ్ళీ డైరి విప్పబోతూంటే మడత పెట్టిన కాగితం చివరి పేజీలో కనిపించింది.

పెళ్లానికి ప్రేమలేఖ- అని కాగితంపై రాసి ఉంది.

పార్వతీ... మొట్టమొదటిసారి నీకు ప్రేమ లేఖ రాస్తున్నాను. ఇన్నాళ్లుగా నా మనసులో ఉన్న మాటలు మొగుడుతనంతో ప్రకటించలేకపోయానేమో. నేను నీకు చాలా కృతజ్ఞతలు చెప్పుకోవాలి. నేనెప్పుడూ చెప్పలేదు. నిజంగా ప్రతీరోజు ప్రతీ క్షణం నీతో జీవితం ఆనందమయం చేశావు.

అబ్బాయికి పెళ్లి అయిపోయాక కోడలుపిల్ల కాఫీ తెచ్చిస్తుంటే నాకంత రుచిగా అనిపించట్లేదు. నిజానికి నీకన్నా రుచిగా పెట్టే టెక్నిక్ ఆ అమ్మాయి తెలుసేమోకానీ నువ్వు నీ చేత్తో ఇచ్చిననప్పుడు ఉండేటంత రుచి నాకు ఉండేది కాదు.

కోడలు వచ్చాక ఒక తెరపడింది. మనుమలు పుట్టాక మరో తెర పడింది. వాళ్ల పుట్టిన రోజులు పునస్కారాల్తో నువ్వు బిజీ అయిపోయావ్. మన మధ్యన ఎన్ని తెరలు పడిపోయాయో... ఈ తెరల పేరు అనుబంధాలు అని నువ్ నాకు చెప్పావ్. కానీ నాకు నిన్ను మించిన బహుబంధాలు అవసరం లేదనిపిస్తోంది. నాకు ఎందుకో ఈ మధ్యన నువ్వు బిజీ అయిపోయినప్పటినుంచీ పోన్లే... నా పార్వతికి నేను లేకపోయినా కాలక్షేపం అయిపోతుందని ధైర్యం కలుగుతోంది. ఇంతలో నా అనారోగ్యం నిన్ను చూడనీయకుండా తీసుకుపోతుందని నాకు అర్థమవుతుంది.

పర్వాలేదు పార్వతీ. ఇన్నేళ్లు నీతో బ్రహ్మానందం చవిచూశాను. నువ్వు ఒప్పుకుంటే వచ్చే జన్మలో ఆపై జన్మలో కూడా నా అర్థాంగిగా ఉండాలని ఆ సర్వేశ్వరుణ్ని కోరుకుంటున్నాను. నేను నీకన్నా ముందు పుట్టాను కనుక నువ్వు నా భార్యవి అయ్యావు. నీకన్నా ముందు పైకి వెళ్తున్నాను గనుక, అక్కడా నా భార్యవే అవుతావ్. నువ్వు ఎంత ఆలస్యంగా వచ్చినా ఫర్వాలేదు. నీ కోసం ఎదురుచూస్తూనే ఉంటాను.

ఇట్లు

నీలో నేను - నీనేను

✦ ✦ ✦

పార్వతి కన్నీళ్లు ఉత్తరాన్ని చెరిపేస్తున్నాయ్.

కరిగిపోతున్న అక్షరాలు భర్త పిలుపుని ప్రతిధ్వనిస్తున్నాయి.

తనకి ఇంతకంటే ఎక్కువ ప్రేమ ఉందని చెప్పలేదని పార్వతి కుమిలిపోయి, కన్నీళ్లతో తడిసిన ఉత్తరాన్ని గుండెలో ఉండచుట్టేసింది.